
ముత్యాలు పగడాలు

# బిచ్చగాళ్ళ జెండా

◆ నిర్వహణ: చావా శివకోటి ◆

నేను రెండవ ప్రపంచ సంగ్రామంలో వైమానికోద్యోగిగా, చావు బతుకుల మధ్య ఆకాశంలో జరిగిన ఒక విమానపోరాటంలో గాయ పడ్డాను.



నా గాయాలు ఏమంత ప్రాణప్రమాదకరమైనవి గాక పోయినా, నా విమానపు పెట్రోలుటాంకుకు, శత్రువుల మరతుపాకి గుళ్ళతో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, నాకు తగిలిన "షాకు"తో చాలా నెలలపాటు నేను మంచం లోనే వుండిపోవలసివచ్చింది. అప్పట్లో ఆరోగ్యానికని, పూనాలో ఒక బంగళా అద్దెకు తీసుకొని వుండేవాణ్ణి. ఎందు వల్లంటే నన్ను రక్షించిన డాక్టరు మిత్రుడు అక్కడివాడే గనక.

నా బంగళా శివాజీనగర్ తోటలమధ్య రైల్వే గిడ్డంగుల చూపుమేరలో, ఎండిపోయిన మూలానది ఎడమతీరాన వుండేది; మా బంగళా ముందున్న శిధిలమైన తోటలోనే నాకు ఎక్కువ కాలక్షేపం అయిపోతుండేది. ఈ శిధిలవనం పక్కనే చాలా పెద్ద ఖాళీస్థలం, ఆ స్థలానికి చివరలో మరొక పాతమేడ వున్నాయ్. ఈ ఖాళీస్థలాలచుట్టూ, దాని యజమానులు ఒక దశాబ్దం క్రిందనో, ఏమో వేయించిన ముళ్ళతీగ కంచెగూడా పేరుకు మాత్రమే మిగిలివుంది. చాలా రోజులు పాడుబడి జీర్ణావస్థలో వున్న ఈ పాతమేడను బొంబాయిసేఠ్ ఒకాయన కొని కొన్ని రిపేర్లు చేయించి కొద్దికాలంలోనే అందులోకి వచ్చాడు. మా తోటమాలివల్ల యీ సేఠుగారి వ్యాపారం యుద్ధం తర్వాత బొంబాయిలో కదబట్టగా యిక్కడకు చేరినట్లు తెలిసింది. ఈ షావుకారి పేరు శంకర్‌లాల్ భోగాలాల్.

శంకర్‌లాల్ భోగాలాల్ ముఖం చూడగానే నాలో కొన్ని వింతవుద్దేశ్యాలు వుద్భవించిన మాట సత్యం. మొదటిది అసహ్యాభావం. ఆ ముఖంలో కళాకాంతీ లేదు. పేరు రోల్డుగోల్డు కళ్ళజోడు వెనుకనున్న క్రూరత్వం ఏదో నాకు అస్పష్టంగా అవుపించింది. లావుగా, పొడుగ్గా భోగాలాల్ వూగినడవటం గూడా నాకు జుగుప్సగానే ఉండేది. రెండో వింతభావం యీ షావుకారు చాలా దురాశాపరుడని. మూడవ భావం నా జీవితంలోనే సంబంధించినది. నేను వైమానికోద్యోగిగా యుద్ధశాఖలో చేకరపూర్వం, బొంబాయిలో చిత్రాలకు సినేరియోలు, కథలూ వ్రాస్తూండేవాణ్ణి. నాకు సినేరిస్టుగా పేరు రాకముందు, నిరక్షరాస్యులైన ఏమాత్రం కళాదృష్టీ లేని ఫిలిం పెట్టుబడిదార్లు కల్పించిన అవమానాలూ, హింసలూ, మోసాలూ అన్నీ అనుభవించాను. మొదట్లో నా కథ నొకటి కొంటామని నమ్మించి తీసుకొని, ఒక వారం రోజులు తిప్పి చివరకు "నీ కథ మా దగ్గర్లేదని" అబద్ధమాడి మోసంచేసి, చివరికి నా బుద్ధిబలంతోనే లక్షలార్జించిన గుజరాతీ సేఠ్ ముఖకవళికలు నాకీ భోగాలాల్ సన్నకళ్ళ జోడు వెనుక దృగ్గోచరమైనాయి.

ఈ విషయం నిర్ధారణ చేసుకుందామని నాకు ఒక విధమైన ఉద్వేగమే కాకుండా, గొప్ప వుత్సుకత గూడా జనించింది. వైమానిక దళం నుండి విడుదల పొందగానే తిరిగి ఫిలిం కథలు, సినేరియోలు వ్రాయటమే వృత్తిగా నిర్ణయించుకొన్న నాకు యీ పాతమోసగాడి చరిత్ర తెలిసికొనే కుతూహలం జనించటం మానవస్వభావ దౌర్బల్యమే కావచ్చు.

కాని యీ కౌతూహలం తీరకముందే ఒక భయంకర సంఘటన సంభవించి నా ప్రయత్నాలన్నింటినీ భగ్నం

◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆



## మునిపల్లె రాజు

ఈయన కథకుడే కాదు. మునీంద్ర పేరుతో గేయాలు, నాటికలు అనేకం రాసారు. 'పూజాఫలం' సినిమా వీరి నవలా ధారంగా తీసిందే. స్పందించటం రచయిత సహజలక్షణమైతే, దాన్ని యధాతథంగా కాగితంపైకి నడపడం ఈయన చేసినపని.

ఈయన కథలలో శిల్పం అంతగా కన్పించదు. కన్పించేదాన్నే రేఖా చిత్రంలా చూపి చదివిస్తాడు.

చదివేక ఆలోచనల్లో పడతాం. తినబోతూ రుచిని గురించి చర్చ ఎందుకు?

ఇక చదవండి.

◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆

చేసింది. ఇది యిట్లా సంభవించింది.

★★ ★★ ★★

శంకర్‌లాల్ భోగాలాల్ పాతమేడ ముందున్న ఖాళీ స్థలంలో ఒకరోజున హఠాత్తుగా కొన్ని చిన్న గుడిశెలు వెలిశాయ్. ఇది పెద్ద విచిత్రమైన విషయం కాదు. ఆ ఖాళీస్థలం బిచ్చగాళ్ళకు, నగరంలో హోటళ్లకు నోచుకొనని పల్లెటూరి ప్రయాణీకులకూ, చాకులూ, కత్తులూ అమ్మజూపి యింకా దోపిడీలు, దొంగతనాలూ కావించే రోహిల్ ఖండ్ దండునకూ ఒక విధంగా అది బహిరంగ సత్రం. నేను చాలాసార్లు రైళ్ళ నుండి దింపివేయబడిన గోసాయీలను గూడా చూశాను. కాని ఎప్పుడూ యిట్లా ఆంధ్రదేశం లోని మెట్టజిల్లాలను స్మృతికి తెచ్చే ప్రకృతి కట్టడాలను చూడ లేదు.




నిజానికవి నైజాం ప్రాంతం నుండి పనులకోసం వలస వచ్చిన వడ్డెవుప్పరులవి. నల్లగా, మట్టిబొమ్మల్లాగా, ఎండలో నిగనిగలాడే కండలతో, బలిష్టమైన శరీరాలతో బొంబాయి, పూనా నగరాల్లో ఎన్నో రోడ్లు, కట్టడాలు నిర్మించిన తెలుగునాటి వడ్డెవుప్పరుల మీద జాలితో భోగాలాల్ వాళ్ళకే నివేశన స్థలం యివ్వలేదని మా తోటమాలి కబురు తెచ్చాడు.

"మరెందుకిచ్చాడు?" అని అడిగాను నేను.

"మీకు తెలీదు బాబూ! వాళ్ళందరినద్దా గుడిశెకు అయిదు రూపాయలు కాజేశాడు. అంతేకాదు. యీపైన నెలకు రెండు రూపాయల బాడిగ కూడా గుడిశెకు ఒక్కంటికి యిచ్చుకోవాలి. వీటన్నింటినీ మించిన యింకో రహస్యం వుంది బాబూ! రః వుప్పర్లు బియ్యం తినరు. వాళ్ళ పేరన చాలా దొంగరేషను కార్డులు సృష్టించి, ఆ బియ్యాన్ని తనే నల్లబజారులో అమ్ముకుంటాడు. అవును బాబూ, మరి బొంబాయిలో వచ్చిన నష్టాల్ని, యీ సేఠ్ లు యితర ప్రదేశాల్లోనే గదా పూడ్చుకొనేది?"

తోటమాలి గణేష్‌మారుతి సేఠ్ లంటే ద్వేషంగా, వుద్రేకంతో ఒక్కొక్కసారి చాలా నిరసన హాస్యంతో మాట్లాడేవాడు.

"బ్లాక్ మార్కెటంటే నేను సహించను. చూడు. పోలీసు సూపరెంటెండుకు వ్రాస్తాను" అన్నాను నేను.

గణేష్ మారుతి కనుబొమలేగరవేసి "మీకు పుణ్యం వుంటుంది" అన్నాడు.

★★ ★★ ★★

తోటమాలి జోస్యం నిజమే అయింది ఆ నెల తిరక్కముందే భోగాలాల్ రేషన్‌షాపుకు లైసెన్సు సంపా



## ముత్యాలు పగడాలు

### 'సత్యజిత్‌రే'కి భారత్‌రత్న?

కీ.శే. సత్యజిత్‌రే, భారతదేశపు కీర్తి బావుటాను ప్రపంచ పరిధిలో ఎగురవేసిన వ్యక్తి. 'షత్రంజ్‌కే, కిలాడి, ఆగంతక్, పథేర్‌పాంచాలి' వంటి కళాత్మక చిత్రాలెన్నో సృష్టించాడాయన. 'ఆస్కార్'ను కూడా పొంది భారతీయులంతా గర్వపడేలా చేశారాయన. ఆయనకు భారత ప్రభుత్వం 'భారత రత్న' ప్రకటించింది. కానీ దానిని తీసుకోకుండానే ఆయన పరమపదించారు. శ్రీ రే భార్య, కొడుకు ఆ అవార్డు ఎప్పుడిస్తారో అని ఎదురు చూస్తూనే వున్నారు.

---

దించి లక్కడ విచ్చలవిడిగా వడ్డీలను దోచివేస్తున్నాడని నేను సులభంగానే గ్రహించగలిగాను.

★★ ★★ ★★

నేను సైనికాధికారిని కావటంతో నా ఒక్క చీటీని పోలీసులు అలక్ష్యం చెయ్యలేకపోయారు.

ఒక వుదయం ఒక పోలీసుదళం, రేషనింగు యిన్స్పెక్టర్లూ కలిసి భోగాలాల్ ఆవరణను చుట్టేసి అన్నీ తనిఖీ చేసి వెళ్ళిపోయారు; కాని నాకు సూపరింటెండెంటు తెలియజేసిందేమంటే భోగాలాల్ మీద కేసు పెట్టేందుకు తగిన ఆధారాలేవీ కనిపించలేదనీ, కాని తను గూడా నల్లబజారు జరుగుతున్నదనే నమ్ముతున్నానని, యింకా విచారణలు జరిపించి తీరుతానని.

ఏది ఏమయినప్పటికీ, మరో రొణ్ణెల్లల్లో వడ్డెవుప్పర్లు అక్కడనుంచి మకాం ఎత్తి వేశారు.

★★ ★★ ★★

మళ్ళీ కొన్నాళ్ళు బీదల డాక్ బంగ్లాలోకి వచ్చిన కొత్త పొంథలెవర్నీ నేను చూడలేదు.

ఇంతలోనే వేసంగి వచ్చింది. దానితోపాటు దక్షిణాదిలో కరువు వార్తలూ వచ్చినాయ్. చూస్తూండగానే తమిళదేశపు బిచ్చగాళ్ళు పూనా కంటోన్మెంటులోని పాశ్చాత్య నాగరికుల హోటళ్ల ముందు డజన్లకు డజన్లు నిలబడి సాయంత్రాల్లో హోటళ్ళల్లో మూగే భాగ్యవంతుల నందరినీ చుట్టముట్టేస్తున్నారు.

ఆ బిచ్చగాళ్ళలో స్త్రీలు, పురుషులూ, బాలురూ వున్నారు; సంఖ్యలో తమిళ బిచ్చగాళ్ళే ఎక్కువైనా, రాయలసీమ నుంచీ (ముఖ్యంగా బొంబాయికి వచ్చే రైలుమార్గంలో వున్న నగరాలనుండి) హైదరాబాదు ప్రాంతాలనుంచీ వచ్చిన, ఏదో ఒక కమ్మని యాసతో తెలుగుమాట్లాడే ఆంధ్ర బిచ్చగాళ్లు గూడా వున్నారు వీళ్ళలో.

వీళ్ళందరికీ "రాష్ట్ర భాష" దక్షిణాదిలో మాట్లాడే బజారు ఉరుదూ.

ఆ దీనవదనాలు కొన్ని మాయింటి ముందున్న బహిరంగమఠంలో మకాం వేశారు.

పూనాలో అసంఖ్యాకమైన సంఘాలూ, సంస్థలూ, క్లబ్బులూ వున్నాయి గాని చాలా వరకు అవి సమాజ సంస్కరణలతోనూ, స్త్రీల సమస్యలతోనూ సంబంధించినవి. కాని వీటిలో బిచ్చగాళ్ళ వుపయోగార్థమై ఒక్కటీ లేకపోవటంతో వింత ఏమున్నది? అభాగ్య జీవితానికి తరగని పాతర అయిన మన దేశంలో ఏ ఒక్క సంస్థ యిందరు బిచ్చగాళ్ళను పోషించగలుగుతుంది?

మొదట్లో భోగాలాల్, అతడి ఉత్తరాది బంట్రోతు గులాబ్‌సింగూ బిచ్చగాళ్ళను అక్కడ నుండి తరిమివేశారు కాని గణేష్‌మారుతి మిలిటరీ ఆఫీసరు బంగ్లా తోటమాలి హోదాతో కొందరు నిర్భాగ్యులికి మాకంచపక్కనే ఆదరణ కలగజేశాడు. మళ్ళీ మూకలు మూకలుగా రేపటి దినముంటే లేని బిచ్చగాళ్ళు, ఆ ఖాళీ స్థలం నిండా మూగారు. ఆసారి భోగాలాల్ లాఠీ వాళ్ళ మీద తిప్పలేదు

కొత్తల్లో, పగలు భిక్షాటనలను ముగించుకొని రాత్రిళ్ళు యీ బహిరంగమఠంలో చేరిన "దేవుడిబిడ్డల" పాటలతో నాకు రాత్రి పన్నెండుగంటల దాకా కాలక్షేపం జరుగుతుండేది. కరువునూ, ఆకలినీ స్వదేశంలోనే వదిలి వచ్చేసినట్లుగా ఆ జానపదగేయాలు. మళ్ళీ పొద్దున్నే పూలమళ్ళకు నీరుపోస్తూ ఆ ట్యూనులన్నీ తిరిగి పల్లెవేసే ముసలి గణేష్ మారుతి వణికే గొంతుతో నాకు మెళకువ వచ్చేది. మరు నిమిషం నాదికాని యుద్ధరంగంలో గూడా నాకేవో ఆంధ్రదేశపు దృశ్యాలో, జీవన పద్ధతులో గోచరమై యింటిమీద దిగులును నాకిట్లాగే వృద్ధి చేస్తుండేవి.

★★ ★★ ★★

నేను ఆఫీసర్ల క్లబ్బుకు వెళ్తాండగా, ఆ సాయంత్రం గణేష్‌మారుతి ఎదురొచ్చి "బాబూ, మళ్ళీ సాగిస్తున్నాడు' అన్నాడు ముఖం చిట్లించి.

"ఎవరు? ఏమిటి?"

"సేఠ్! నల్లబజారు"

"నేను పోలీసులకు రిపోర్టు చెయ్యబోవటం లేదు" అన్నాను ఖచ్చితంగా.

మారుతి నావంక ఒకసారి నిరాశగా చూసి, తలమీది మురికిటోపీ సర్దుకుంటూ తన పని చూసుకోబోయాడు.

★★ ★★ ★★

వెలిసిపోయి, మురికిబారిన రంగు రంగుల పాతతుంపుల గుడ్డలతో మా యింటి ముందు బిచ్చగాళ్ళ డేరాల శిబిరం వెలిసింది. వికలాంగులు, వృద్ధులు, రజాకార్ వరకాన్నుండి తప్పించుకువచ్చిన శరణార్థులు, క్షామపీడితులు యీ డేరా క్యాంపులోని పౌరులు. దక్షిణాది భాషలన్నీ, అన్ని భాధలనూ అన్ని ఆశలను అన్ని నిరాశలనూ భరించి నిశ్శబ్దత నిచ్చే కాలరాత్రుల్లో యీ నగరంలో, యీ తమస్సులో కలగా పులగంగా సజీవంగా వినబడుతుంటై; సృష్టీ, ప్రకృతీ లోకమూ, మానవులూ తిరిగి ప్రాణం పొందే వుషఃకాంతుల్లోనే యీ అనాధ నగరం నిర్జీవమైపోతుంది! ఆ దృశ్యాలకు నేను బాగా అలవడిపోయాను. యుద్ధంలో ప్రతిక్షణమూ, ప్రతివస్తువులో, ప్రాణిలో, జీవిలో, ఆత్మలో, మృత్యువూ, అపనమ్మకమూ దర్శించిన నాకు, యీ బిచ్చగాళ్ళ సన్నిధి ఏమని కష్టమనిపిస్తుంది?

కాని యీ నగరాధిపతి ఎవరు? తెలంగాణపు యాసతో రాత్రల్లా పదాలు పాడే ముసలి యల్లమందా? పెద్ద గొంతుతో తమిళంలో తనకన్నా బలహీనుల్నీ, స్త్రీలను తిట్టే తెలివిగల బిచ్చగాడు మురుగేశనా? కాదు!

భోగాలాల్ నగరాధిపత్యం వహించి ఎన్నాళ్లో అయింది అదే గణేష్‌మారుతి నాకు చేసిన రెండవ కంప్లైంటు. బిచ్చగాళ్ళ దైన్యం నుండి, బిచ్చగాళ్ల పాటల నుండి రూపాయలు సృష్టిస్తున్నాడు మాజీ స్టాక్ బ్రోకరూ, ఫిలిం నిర్మాతా, వడ్డీవ్యాపారీ, దివాలాకోరూ భోగాలాల్.

బిచ్చగాళ్ళు అడుక్కువచ్చిన బియ్యమంతా తక్కువ ధరకు కొని, అందులో యింత తవుడూ యిన్ని రాళ్ళూ, యింత మట్టీ కలిపి, మహారాష్ట్రపు ఎండు రొట్టెలు తినలేక చచ్చిపోతున్న, మిలిటరీలో ఉద్యోగాలకని వచ్చిన దక్షిణాది బ్రాహ్మల కందరికీ మూడురెట్ల ధరల కమ్ముతూ, తన కులం వాళ్లలో తిరిగి గౌరవం పొందే అర్హతలను సంపాదిస్తున్నాడు శంకర్‌లాల్ భోగాలాల్.

ఎవరైనా, ఏరోజైనా తన బియ్యమో, గోధుమపిండో యివ్వ నిరాకరించాడా, గులాబ్‌సింగ్ లాఠీదెబ్బలతో ఆ పట్టిన దయ్యం వదిలిపోతుండేది. లేదా భోగాలాల్ స్వయంగా వచ్చి ఒక డేరాను కూలదోసి, ఆ బిచ్చగాణ్ణి అనాథ నగరం నుండి వెళ్ళగొడుతుండేవాడు. హైద్రాబాదు బిచ్చగాళ్ళకు తమిళ బిచ్చగాళ్ల వత్తాసురాలేదు. తమిళ బిచ్చగాళ్ళకు నైజాం బిచ్చగాళ్ళమద్దతూ లేదు. ఒకరోజున గులాబ్‌సింగ్ చేతుల్లో ప్రాణం విడువనున్న ఒక బిచ్చగాడి రక్షణకోసం, నేను, నా పాత రివాల్వరును భయానికి చూపించవలసి వచ్చింది.

కాని యీ స్వల్ప విషయాలేవీ అనాధ నగరాన్నంటలేదు రాత్రిళ్ళ జోరుగా పాటలు సాగుతూనే వున్నై. అప్పుడప్పుడు నందనార్ భజన కీర్తనలు. ఒకసారి నా ఆశ్చర్యానికి క్షేత్రయ్యపదం వినవచ్చింది.

★★ ★★ ★★

కొత్త బిచ్చగాళ్ళ ప్రవాహం-ఆగలేదు. ప్రతిదినమూ రైలు పెట్టెల్లో బల్లలకింద నక్కీ, గూడ్సుబళ్ళలో గార్డుకు తెలీకుండా ప్రయాణం చేసి దక్షిణాది కరువుదాసులు పూనా చేరుతూనే వున్నారు. వీళ్ళకు తోడు మలబారునుండి గంజి లేక సైన్యంలో భర్తీ కావటానికి వచ్చి నిరాకరించబడ్డ ముసలీ ముతకా గూడా వున్నారు. నాలుగురోజుల పస్తుల్తో, ఎక్కడా కూలి దొరక్క, ఆత్మాభిమానం తనంతట తాను

చావగానే వీళ్ళందరూ కొత్త బిచ్చగాళ్ళై వూరి పొద్దెరగకుండా తిరుగుతున్నారు. ఆ మానవకోటి ఖాళీవున్న ప్రతి పేటలోనూ నిండిపోయింది. రోడ్లమీద, మరుగుదొడ్లలో, స్టేషనుముందు, దర్గాలమీద, స్మశానపు గేట్లముందు, శంకర్‌లాల్ భోగాలాల్ తనదని చెప్పుకొంటున్న ఖాళీ స్థలంలో ఒకటేమిటి? అనంతమైన పూనాలోని అనారోగ్యకర ప్రదేశాలన్నింటిలో నిండిపోయింది. మా నగరంలో కొత్త డేరాలు వెలిసినై. కొత్త గొంతుల్తో కొత్త పాటలు వినబడుచున్నై

★★ ★★ ★★

కాని పాత గొంతుల్లో జీవం తగ్గిపోయింది. ఎప్పుడూ నిశ్శబ్దమెరుగని రాత్రిళ్ళ గూడా అనాథ నగరానికి నిశ్శబ్దానిస్తున్నై.

"బిచ్చం దొరకడంలేదు బాబూ. ఎవరు పెడతారు యీ కరువురోజుల్లో? అందులో యీ సిటీల్లో పుణ్యం, పాపం, జాలీ ఎక్కడున్నై?" అన్నాడు తన సహజధోరణిలో మారుతి. మారుతి పల్లెటూరి నుంచి వచ్చాడు. చాలా భక్తిపరుడు.

ఇప్పుడు ప్రతిరోజూ గులాబ్‌సింగ్ లాలీకి పని తగులుచున్నది. ప్రతిరోజూ అరవ గుమాస్తాలతో బియ్యపు దొంగధరలు నిర్ణయించటానికి జరిపేవాదనలు వదిలి, శంకర్‌లాల్ భోగాలాల్ స్వయంగా, రంగుగుడ్డల శిబిరాలను పడదొయ్యటానికి రావలసి వస్తూనే వుంది. కుయ్యో, మొర్రో బాధాప్రలాపాలు అన్ని భాషల్లోనూ వినబడుతునే వున్నై ప్రతిదినమూ.

★★ ★★ ★★

ముసలి యల్లమంద ఎప్పుడూ బిచ్చానికి ఒంటరిగా వెళ్ళటం నేను చూడలేదు. అతనివెంట ఎప్పుడూ నీడవలె ఆర్కాటు జిల్లా కరువు నుండి తప్పించుకు వచ్చిన మురుగేశన్ వుంటాడు. మురుగేశన్‌కు ఒక కాలు కొద్దిగా ఆవుదు. అతనెప్పుడూ యల్లమందకు ముందు నడవడు. వెనక వెనకనే, ఏవో కబుర్లు వచ్చీరాని హిందూస్థానీలో చెబుతూ, నడుస్తుంటాడు.

ముసలి యల్లమంద చేతిలో పొడుగైన కర్రొకటున్నది; దాని చివర చిన్న గజ్జలగుత్తినొకటి కట్టాడు యల్లమంద. కర్రను భూమి మీద కొట్టినప్పుడల్లా అదొక వింత తాళం మోగుతుంది. దానికి అనుగుణంగా యల్లమంద గొర్రె మందల్ని కాచే గొల్లల మేల్కొలుపు పదాలు పాడతాడు. మురుగేశన్ మధ్య మధ్య తన గొంతు కూడా కలిపి 'అనుపల్లవి' వేస్తాడు. జోలెపట్టటం, మొయ్యటం గూడా మురుగేశు చేసే పనులే.

"తాతా!" అంటాడు దక్షిణాది మురుగేశు.

"ఏం మనవడా!" అని సీతభూమిలో గొర్రెల్ని మేపిన యల్లమంద పిలుపుకు జవాబిస్తాడు.

★★ ★★ ★★

కాని కొత్త సమ్మర్దం వచ్చి పైబడ్డ తర్వాత కాళ్ళీడ్చుకుంటూ, ఆశలేని, శూన్యమైన దృక్కుల్తో, ఆకలితో, దిగాలుపడి, మేనెల వడదెబ్బలు తిని అన్నింటినీ మించి ఖాళీజోలెతో తాతామనవళ్ళిద్దరూ దుఃఖనగరం చేరుతున్నారు. మళ్ళీ తెల్లవారుతుంది. మళ్ళీ ఆకలి, నిరాశ, శూన్యం. కాళ్ళు యీడ్పు. ఖాళీ జోలె. నిశ్శబ్దంగా ఒకరితో ఒకరు మాట్లాడుకొనకుండా, దారిపొడుగునా పెదిమలు ఒక్కసారిగూడా విప్పకుండా, ముందాశ లేకుండా ఒకచోటు విడిచి మరొకచోటుకు జరిగి, తిరిగి ఆ దుఃఖ వలయాన్నే పూర్తిచేయటానికి తిరిగివచ్చే యీ యిద్దరు బిచ్చగాళ్ళ మనసుల్లో ఏముందో ఎవరు చెప్పగలరు?

"ఎద్దులల్లే వున్నారు. పనిచేసుకోరాదా?"

ఎక్కడపని? ఏమిపని? ఎవరిపని?

"పరదేశీ ముండాకొడుకులు. మహారాష్ట్రం దోపిడి చేస్తున్నారు".

"పరదేశీలమా? ఆకలివేసి ప్రక్క జిల్లాలని వచ్చాం. రాగూడదా? ఎవరూ ఆ మాట చెప్పలేదే?"

"ఏ... మద్రాసీ"

ఇద్దర్లో ఎవ్వరూ మద్రాసు చూడలేదు.

"ఆపండిరా! మీ బుర్రలేని పాటలు" బుర్రలేని పాటలు! హా!! ఆ పాటలతో గాదా వేలకు వేలు గొర్రెలు నెమరువేసి గడ్డిపరకలు జీర్ణించుకొన్నది? ఆ గొంతుకాదా తప్పిపోయి తిరుగుతూన్న గొర్రెపిల్లలకు పిలుపునూ,



# ఒక ఆత్మను వేరొకటి కదిల్చి అగ్ని రగుల్కొనే దృష్టి అది.

ఆశనూ, అభయాన్నీ అందించింది? తెలంగాణా పుల్లరి అడవులన్నీ గుర్తించగల ఈ పాటలా బుర్రలేని పాటలు? గుట్టల్లో, గుళ్ళల్లో, పెళ్ళిసంబరాల్లో, కొలుపుల్లో, సంతల్లో వేలాదిని తలవూపించిన ఈ పాటల్లో లోపమేముంది?

ఏమైనా, గింజ కూడా నిండని పిచ్చిజోలె, అరిగిపోయి శక్తిలేని కూలబడే వాళ్ళ, అంటుపడ్డ డొక్కలూ. ముందున్న వస్తువును గూడా చూడలేని కళ్ళూ యివీ కఠిన సత్యాలు.

మురుగేశన్ వుపాయాలు గూడా ఏవీ లాభించలేదు. స్టేషను ముందు కూర్చొని యల్లమందును గుడ్డివాణ్ణిగా మార్చినా కానీ రాలలేదు. తన కాళ్ళకూ చేతులకూ మురికి నూనెగుడ్డలు కట్టుకున్నా రాగి దమ్మిడీ దర్శనం కాలేదు. ఇద్దరూ కుంటివాళ్ళుగా తిరిగి జన్మఎత్తినా జోలె అడుగు వూడేస్థితి కన్పించలేదు. అడుగులేని యీ చిన్న జోలె!!!

పై పెచ్చు స్టేషను దగ్గరి బీటు పోలీసుకు యీ వేషాలన్నీ అనుమానం కలిగించినై. ఇక మళ్ళీ ఆ చెంతనా, చాయలాపోయే ఆస్కారం, హక్కు పోగొట్టుకొన్నారు. బస్సు స్టాండ్ వద్ద గూడా యిదే తంతు. యీ పోలీసులకు ఎర్రబుట్టల్లేవు. వీళ్ళ లాఠీలు చిన్నవి, అంతే బేధం!!

గులాబ్‌సింగు వచ్చి జోలె చూశాడు. కళ్లెర్రజేసి యిద్దరివంకా చూశాడు. అప్పటికే శిబిరాల నగరంలో దెబ్బలు తిన్న అనాధలంతా, వింతలో ఆకలిని మరిచేందుకనేమో యిక్కడ చుట్టూ మూగారు. అందులో యింకా కొందరు ఏడుస్తూనే వున్నారు. మరికొందరు భయంతో వణికిపోతూనే వున్నారు. పిల్లలు చిక్కి బొమికెల గూళ్ళై, కాకి రొమ్ములతో భయవిహ్వలులై గులాబ్ సింగు వంక చూస్తున్నారు. మరొక క్షణంలో దుఃఖనగర వాసులంతా అక్కడే వున్నారు.

యల్లమంద పెదిమలు కదిలి ఏదో జవాబుకోసం వెతుక్కుంటున్నాయ్. మురుగేశన్ కళ్ళు నేలమీదికి వాల్చాడు.

గులాబ్‌సింగ్‌కు అవమానం కలిగింది. ఎంత అవమానం యీ మౌనం? దయలేని లాఠీ ముందు రక్షణలేని అనాధల నెందరినో మోది, వాళ్ళ బొమికెలకు పదును పెట్టిన తన లాఠీ ముందు గూడా యీ బిచ్చపు ముండాకొడుకుల కెంత దర్జా? పలకరా?

లాఠీని యల్లమందకు ఒకటి వడ్డించాడు. యల్లమంద కదలకనే కళ్లెత్తి చూశాడు. గుంపులోని బిచ్చగాళ్ళలో కొందరు పెద్ద కేకల్తో అక్కడే కూలబడ్డారు. కొద్దిమంది తప్పుకుపోయారు.

యల్లమంద బాధ కనపడనీయలేదు. జాలిగా చూస్తున్న మురుగేశన్ వంకకు దృష్టి మరల్చాడు. మురుగేశుకు ధైర్యం చెప్పే దృష్టి అది. ఒక ఆత్మను వేరొకటి కదిల్చి అగ్ని రగుల్కొనే దృష్టి అది. ఒక పీడితహృదయం నుండి మరొక తాడిత హృదయానికి అర్థంలేని వ్యక్తం కాని, మానవ సందేశాన్ని కొనిపోయే దృష్టి అది.

మురుగేశు ముఖంలోని భయం యిప్పుడు భయంకరంగా వంకర్లు తిరిగింది. నెత్తురు లేక ఆకలితోనే ఎర్రనైన నేత్రాల్లో నిప్పులు వేగిన నిప్పుడు. ఒక్క త్రుటిలో అతని శరీరమంతా రౌద్రంతో బ్రహ్మాండమంత లసుగా వుప్పొంగింది. మరుత్రుటిలో, గుండెలు విరుచుకునిలబడివున్న గులాబ్‌సింగు లాఠీని పైబడి మురుగేశు లాగుకున్నాడు.

యల్లమంద లంఘించి, సింగు జుట్టు లంకించుకొని కిందకు వంచాడు.

మరి ఆలస్యం లేదు. మురుగేశు లాఠీ ఆ వంగిన నడుం మీద తాండవ నృత్యం చేయసాగింది.

గుంపులో కొందరు బిచ్చగాళ్ళు అరిచారు. మరికొందరు "తన్నండి తన్నండి" అని కేకలు వేశారు. చాలా మంది "పాపిష్టి ముండావాడు" అని దీవించారు. కొంచెం పుష్టివున్నవాళ్ళ పొయ్యి రాళ్ల వీరి పెద్దవాటిని పృథ్వి మీద కూలిన పీడకుడు గులాబ్‌సింగ్ మీద బలంగా కుమ్మారు. మూలిగి సింగు దొర్లి గింతలు పెట్టి కదలక మెదలక దుమ్ములో దుమ్ముగా పడ్డాడు. చుట్టూ రక్తం చిన్న పెద్ద మడుగులుగా నిలిచింది.

మురుగేశ్ అందరివంకా చూసి

"చూస్తారేందా, పిచ్చిముండా కొడుకుల్లారా" అని అరచాడు.

బిచ్చగాళ్ళందరూ భయపడ్డారు తమనెక్కడ చంపుతాడోనని. కాని ఒక ముసలి బిచ్చగాడు రక్తంలో పడిన తన పేలికల తలపాగా కొరకు వంగగానే, మురుగేశు ఒక్క తన్ను తన్నాడు.

"ఇటు తే" అన్నాడు కళ్ళెర్రతో. వాడు భయంతో వణికి రక్తంలో తడిసిన ఎర్రగుడ్డ నిచ్చాడు.

మురుగేశు దాన్ని గులాబుసింగు లాఠీక్రరకు కట్టాడు. దాన్ని అక్కడే నిలబెట్టాడు.

"పదండి పదండి. మన బియ్యమంతా సేఠ్ కొట్లో వున్నై.


బిచ్చగాళ్ళంతా సేఠ్ కొట్టున్న పాతమేడవైపు నడిచారు మురుగేశు ముందుకెళ్ళి చూశాడు. భోగాలాల్ అప్పటికే పలాయనం చిత్తగించాడు.

కొంచెం వదులుగావున్న బియ్యం బస్తాను పిచ్చి శక్తితో ముందుకులాగి మురుగేశు అందరికీ చూపి

"తీసుకోండిరా" అని గద్దించాడు.

★★★★★

నేను క్లబ్బు నుంచి తిరిగి వచ్చేటప్పటికి బిచ్చగాళ్ళ జెండా చుట్టూ పోలీసులూ మేజస్ట్రేటులూ కనిపించారు!



## ఎముకలు అతికే నూతన పరికరం

పిప్పి పిప్పిగా అయిన ఎముకలను సైతం నునాయాసంగా అతికే అధునిక పరికరం అధునిక వైద్య రంగంలో చోటు చేసుకుంది. కేవలం రెండే రెండు గంటల్లో పిక్స్ చేసే ఈ పరికరం 'ఎలిజారోవ్'ని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలోని అశ్విని ఆర్థోపెడిషియన్ ఆసుపత్రిలో ప్రవేశ పెట్టినట్లు డాక్టర్ బి. అశోక్ కుమార్ చెప్పారు.

ఇది రష్యాకు చెందిన పరికరం పూర్వం రాడ్‌ని లోపల ఫిక్స్ చేయడం వలన రోగి ఆరు నెల్లపాటు సమయం పట్టేది. ప్రస్తుత పరికరం అమరిక వలన రోగి కొద్దివారాలలో తన కార్యక్రమాలలో ఆటంకం తొలగించుకోవచ్చు అని వైద్యులు చెప్పారు. వైర్సు బోల్సు ద్వారా దీన్ని ఏర్పాటు చేస్తారు. ఇటీవలే ఆరు ముక్కలు అయిన ఒక రోగి కాలుకి దీన్ని అమర్చి విజయం సాధించినట్లు వైద్యులు చెప్పారు.

ధరణీప్రగడ సత్యమూర్తి